ప్రారంభోత్సవ సభ



ఎల్‌బీనగర్ పరిధి బైరామల్‌గూడ కూడలి వద్ద రూ.194 కోట్లతో నిర్మించిన ఫేజ్‌-2 ఫ్లై ఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతున్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి. వేదికపై సీఎంతో పాటు మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు మధుయాష్కీ గౌడ్ ఉన్నారు.



ముఖ్యమంత్రి ప్రారంభించిన బైరామల్‌గూడ ఫేజ్‌-2 ఫ్లైఓవర్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తమ సెల్ ఫోన్లలో బంధించేందుకు పోటీ పడుతున్న ఆయన అభిమానులు, స్థానికులు

నేడు భాషా పండితుల ఆత్మీయ సమ్మేళనం

చాదర్‌ఘాట్: తెలంగాణ రాష్ట్రంలోని తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠా భాషా పండితుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఉదయం హైదరాబాద్ గాంధీభవన్‌లోని ప్రకాశం హాల్‌లో నిర్వహిస్తున్నట్లు భాషా పండితుల ఆత్మీయ సమ్మేళనం కన్వీనర్ వివేక్ భవానీ, కో కన్వీనర్ డాక్టర్ విజయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మేళనానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, పొన్నం ప్రభాకర్ విశిష్ట అతిథులుగా మల్లు రవి, కోదండరాం పాల్గొంటారని వారు తెలిపారు. రాష్ట్రంలోని భాషోపాధ్యాయులు సంఘాలకు అతీతంగా పాల్గొని సభను విజయవంతం చేయాలని వారు కోరారు.

నేర ప్రవర్తన మార్చుకోవాలి: ఏసీపీ



నాగోలు ఠాణాలో నేర అనుమానితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ కృష్ణయ్య

నాగోలు: నేరాలకు అలవాటు పడిన వారు తమ ప్రవర్తన మార్చుకోవాలని ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య సూచించారు. శుక్రవారం రాత్రి నాగోలు పోలీస్ స్టేషన్‌ను ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య సందర్శించారు. ఈ సందర్భంగా నేర అనుమానితులను పోలీస్ స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ, నేర ప్రవర్తనను మార్చుకోవాలని సూచించారు. మీ పిల్లల భవిష్యత్ గురించి ఆలోచన చేసి బతకాలన్నారు. ఎలాంటి గొడవల్లో తలదూర్చకుండా శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ కలిసి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాగోలు సీఐ పరుశురామ్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మహేష్‌కుమార్ గౌడ్‌కు కాంగ్రెస్ నేతల సత్కారం



మహేష్‌కుమార్‌గౌడ్‌ను సత్కరిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

చాదర్‌ఘాట్: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌ను మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సత్కరించారు. శనివారం ఉదయం ఆయనను కలుసుకున్న టీపీసీసీ జనరల్ సెక్రటరీ బొల్లు కిషన్, మలక్‌పేట ఏ బ్లాక్ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ ఓబీసీ వైస్ చైర్మన్ చౌకి రవి కుమార్ పటేల్‌లు శాలువా కప్పి సన్మానించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఆయన సూచించారని నాయకులు తెలిపారు.

సీనియర్ ఇంటర్-డిస్ట్రిక్ క్యారమ్స్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభించి క్యారమ్స్ ఆడుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: 51వ తెలంగాణ రాష్ట్ర సీనియర్ ఇంటర్- డిస్ట్రిక్ క్యారమ్స్ పోటీలు మన్సూరాబాద్ డివిజన్ మల్లికార్జుననగర్ కమ్యూనిటీహాల్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. పురుషుల సింగిల్స్, డబుల్స్, స్త్రీల సింగిల్స్, వెటరన్ సింగిల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీలు నాలుగు రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, షేక్ ఖాదీర్, మదన్‌రాజ్, సీనియర్ సిటిజన్ సంఘం నాయకులు సత్యనారాయణ, వీరారెడ్డి, రామిరెడ్డి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు 'రైస్ ఏటీఎం' చేయూత

మన్సూరాబాద్: కొవిడ్ వల్ల జీవనోపాధి కోల్పోయి రోడ్డునపడ్డ పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే దృఢ సంకల్పంతో రైస్ ఏటీఎంను ప్రారంభించామని రైస్ ఏటీఎం నిర్వాహకుడు, సామాజిక కార్యకర్త దోసపాటి రాము అన్నారు. నాగోలు డివిజన్ పరిధి రాక్ హిల్స్ కాలనీలో శనివారం 15 మంది పేద కుటుంబాలకు చెందిన మహిళలకు కుట్టుమిషన్లు, తోపుడు బండ్లు, టీస్టాల్ స్టాండ్‌లను ప్రాజెక్టు ప్రిషా కో ఆర్డినేటర్ యశస్విని జొన్నలగడ్డతో కలిసి శనివారం ఉచితంగా అందజేశారు. దోసపాటి రాము మాట్లాడుతూ, రైస్ ఏటీఎం ద్వారా కొన్ని లక్షల మందికి బియ్యం, నిత్యావసర సరుకులు అందించామని, నేటికీ అందిస్తున్నామన్నారు. కరోనా తర్వాత కొన్ని వేల కుటుంబాలు రోడ్డును పడ్డాయని, అందుకే రైస్ ఏటీఎంను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



మహిళలకు కుట్టుమిషన్లు, తోపుడు బండ్లు అందజేస్తున్న దోసపాటి రాము, యశస్వినీ జొన్నలగడ్డ

కల్యాణ వైభోగమే..!

కనులపండువగా శివపార్వతుల కల్యాణం





వాసవి కాలనీలో పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: శివరాత్రి సందర్భంగా ఆర్‌కే పురం డివిజన్ వాసవీ కాలనీలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి స్ఫటిక లింగానికి అభిషేకాలు, శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, కార్యదర్శి అయిత అంజయ్యగుప్తా, కోశాధికారి కృష్ణయ్య, సుదర్శన్, తమ్మన శ్రీధర్, అనిల్ కుమార్, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

ఒంగోనిగుట్టలో..

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని ఒంగోనిగుట్టపై కొలువైన భ్రమరాంబికా మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. చింతల ఆగమయ్య యాదవ్, నాగోలు యాదవ్ సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అగ్ని గుండాలు, గొలుసు తెంపుట, బోనాలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. నాగోలు కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్‌నాథ్ యాదవ్, యాదవ్ సంఘం అధ్యక్షుడు చింతల కిరణ్‌కుమార్ యాదవ్, మహేందర్ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, చింతల ప్రవీణ్ యాదవ్, సీహెచ్ జనార్దన్ యాదవ్, రాజు యాదవ్ పాల్గొన్నారు.



ఒంగోని గుట్టపై భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న యాదవ్ సంఘం నాయకులు

భక్తిశ్రద్ధలతో జాగరణ..

మన్సూరాబాద్: మహాశివరాత్రి ఉత్సవం సందర్భంగా మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని వీరన్నగుట్టపై భద్రకాళీ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం రాత్రి జాగరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి గుట్టపైనే ఉండి భక్తులతో కలిసి సత్యవాణి బృందం ఆలపించిన సాంప్రదాయ గీతాలను వింటూజాగరణలో పాల్గొన్నారు. శనివారం ఉదయం గుట్ట కింద అగ్నిగుండాలను నిర్వహించారు.

ఆధ్యాత్మికతతో మనసుకు ప్రశాంతత

మలక్‌పేట: ఆధ్యాత్మికతను అవర్చుకుంటే మనసుకు ప్రశాంత, ముక్తి లభిస్తుందని సలీంనగర్ షాప్స్ అండ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం రాత్రి సాయిరామ్ బుక్ పాయింట్ దగ్గర మహాశివరాత్రి జాగరణ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివ లింగానికి భక్తులు అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి అనంతరం భక్తి సంగీతంతో శివ నామస్మరణ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కొత్తపేట భవానీ మందిరంలో...



పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి కొత్తపేట భవాని మందిరాన్ని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ దర్శించుకున్నారు. పరమ శివుడిని పాలతో అభిషేకించి మహారుద్రాక్షలతో తులాభారం వేయించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు సురేందర్ చారి, రిషి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



వీరన్నగుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జాగరణ చేస్తున్న భక్తులు



సలీంనగర్‌లో జాగరణలో పాల్గొన్న భక్తులు

షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గ పరిధిలోని సైదాబాద్, అంబర్‌పేట, చార్మినార్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అమీన్ కాలనీ, సైదాబాద్, ప్రెస్ కాలనీ, సపోటాబాగ్, ముంతాజ్ కాలనీ, శంకర్‌నగర్, వాహేద్ నగర్, ఓల్డ్‌మలక్‌పేట, అక్బర్ బాగ్, కమలానగర్, ఫర్హత్‌నగర్, చంచల్‌గూడ, ఆజంపురా ప్రాంతాలకు చెందిన 251 మందికి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, మజ్లిస్ పార్టీ నాయకులు ఉన్నారు.

కమలానగర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

చాదర్‌ఘాట్: నేరాల నియంత్రణ కోసం కమలానగర్ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కాలనీ అధ్యక్షుడు దర్శనం రామస్వామి కోరారు. చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సైదులును ఆయన కాలనీవాసులతో కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ, తమ కాలనీలో రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. తమ వినతులకు సీఐ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.



సీఐ సైదులును కలిసిన కాలనీ అధ్యక్షుడు రామస్వామి తదితరులు

మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి



మహిళల కోసం రూపొందించిన ప్యాకేజీలను విడుదల చేస్తున్న కామినేని వైద్యులు

మన్సూరాబాద్: మహిళలు తమ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ ఎప్పటికప్పుడు తగిన పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్ సీఓఓ డాక్టర్ గాయత్రి కామినేని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పలు వైద్య పరీక్షల ప్యాకేజీలు, ఇస్తున్న రాయితీలను శనివారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ, 30 ఏళ్లలోపు మహిళలకు, 30-50 ఏళ్ల మధ్య వారికి, 50 ఏళ్ల దాటిన మహిళలకు ప్రత్యేకంగా ప్యాకేజీలు రూపొందించామన్నారు. అదే విధంగా 50 ఏళ్లు దాటిన మహిళలకు మమ్మోగ్రామ్ ప్యాకేజీని అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్యాకేజీలన్నీ ఈ నెల మొత్తం అమలులో ఉంటాయని, మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ



పాల్గొన్న కార్పొరేటర్లు, ఆర్టీసీ యూనియన్ మాజీ నేత అశ్వర్థామరెడ్డి

ఎల్‌బీనగర్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామి వివేకానంద క్రాంతి సంఘ్ ఆధ్వర్యంలో ఎన్జీఓస్‌కాలనీలోని ఛత్రపతి శివాజీ క్రికెట్ స్టేడియంలో డేఅండ్ నైట్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ నిర్వహించారు. పోటీలకు ఆర్టీసీ యూనియన్ మాజీ నాయకుడు అశ్వర్థామరెడ్డి, కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డిలు అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో యాదగిరిరెడ్డి, శరత్‌కుమార్, రమేష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్‌మలక్‌పేటలో ఫ్లాగ్‌మార్చ్



ఓల్డ్‌మలక్‌పేటలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న చాదర్‌ఘాట్ పోలీసులు

చాదర్‌ఘాట్: వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రజల్లో భరోసా కల్పించేందుకు శనివారం ఓల్డ్‌మలక్‌పేటలో చాదర్‌ఘాట్ పోలీసులు సీఐ సైదులు ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. దాదాపు 100 మంది పోలీస్ అధికారులతో కలిసి డివిజన్లలోని అన్ని కాలనీల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో మేలు



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఉపయుక్తంగా ఉంటాయని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. శివ సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ హెల్త్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం అక్బర్‌బాగ్ డివిజన్ ఆనంద్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఆక్యుప్రెషర్ అండ్ మాగ్నటిక్ థెరపీ ఉచిత శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని, ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు పూజల శ్రీదేవి, సెక్రటరీ ప్రతిభ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు



నాగోలు పోలీస్ స్టేషన్‌లో మహిళా సిబ్బంది సత్కరించిన ఏసీపీ కృష్ణయ్య, సీఐ పరుశురామ్

మలక్‌పేట: మహిళలు అన్ని రంగాల్లో పురుషులను అధిగమించి రాణిస్తున్నారని ఉస్మానియా యూనివర్సిటీ ఎంబీఏ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంత ఆత్మ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ అవంతి డిగ్రీ, పీజీ కాలేజీలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. జీవితంలో తమ కలలను నిజం చేసుకోవడానికి మహిళలు కృషి చేయాలని సూచించారు. రామాయణంలో సీతాదేవి వ్యక్తిత్వం మహిళలకు ఆదర్శమన్నారు. అవంతి విద్యాసంస్థల హెచ్‌ఆర్ డైరెక్టర్ జయప్రద మాట్లాడుతూ, కుటుంబం, ఉద్యోగం రెండు బాధ్యతల నిర్వహణలో పడి మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారిని సత్కరించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఏఓ మోహన్‌రావు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

నాగోలు: సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకమైనదని ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం రాత్రి నాగోలు పోలీస్ స్టేషన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహిళా సిబ్బందిని సత్కరించి జ్ఞాపికలతో పాటు చీరలు బహూకరించారు. ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. ఇంట్లో కుటుంబాన్ని చక్కదిద్దుతూ సమాజంలో శాంతి భద్రతలు కాపాడటంలోనూ చురుకుగా వ్యవహరిస్తున్న మహిళా పోలీసులు అభినందనీయులని అన్నారు. కార్యక్రమంలో నాగోలు సీఐ పరుశురామ్, ఎస్‌ఐలు శ్రీనివాస్, మధు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 11, వంకాయ 28, బెండ 45, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 35, క్యాబేజీ 20, ఫ్రెంచి బీన్స్ 45, క్యారెట్ 23, దొండ 25-35, చిక్కుడు 28-50, గోకర 28, బీట్‌రూట్ 23. క్యాప్సికం 43, ఆలు 23, దోస 18, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 24, చామగడ్డ 40.

జీఓ 118కు వెంటనే సవరణ చేయండి

శ్రీసాయినగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ ఫోరం డిమాండ్



సాయినగర్ కాలనీలో నిరసన వ్యక్తం చేస్తున్న సీనియర్స్ సిటిజన్స్ ఫోరం నాయకులు, కాలనీ వాసులు

నాగోలు: గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 118 వల్ల నాగోలు పరిధిలోని సాయినగర్ పరిసర ప్రాంత కాలనీల వారికి ఎలాంటి ఉపయోగం లేదని, ఈ జీఓకు వెంటనే సవరణ చేయాలని శ్రీసాయినగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు దయానందరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నాగోలు సాయినగర్ కాలనీలో సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో జీఓ 118 అమలు వల్ల జరిగిన అపార నష్టాన్ని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఎన్నికల్లో ఓట్ల కోసం హడావుడిగా జీఓ 118ను తీసుకువచ్చి కాలనీవాసులకు పూర్తిగా అన్యాయం చేసిందన్నారు. కన్వెయన్స్ డీడ్‌ను రిజిస్టర్డ్ స్టాంప్ పేపర్‌పై కాకుండా తెల్ల కాగితంపై గత ముఖ్యమంత్రి కేసీఆర్, ఇంటి యజమాని ఫొటోను జత చేసి ఇచ్చారని, దానికి ఎటువంటి విలువ, గుర్తింపు లేకుండా పోయిందన్నారు. ఈ కన్వెయన్స్ డీడ్‌పై ఏ బ్యాంక్ కూడా రుణం ఇవ్వడం లేదన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సదరు జీఓకు సవరణ చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాగోలు డివిజన్ మహిళ అధ్యక్షుడు మంజులారెడ్డి, సాయినగర్ కాలనీ సీనియర్ సిటిజన్ ఫోరం ఫైనాన్స్ సెక్రటరీ శ్రీనివాసాచార్యులు, నాగేంద్రప్రసాద్, లాలయ్యగౌడ్, సత్యనారాయణరెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, నరసింహారెడ్డి, వీరాంజనేయులు, అశోక్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నీటిని తోడుతున్న బోరుబావిని సీజ్ చేయాలి



కాలనీలోని బోరు బావి నుంచి అక్రమంగా నీటిని తోడి ట్యాంకర్లలో నింపుతున్న దృశ్యం

ఎల్‌బీనగర్: కాలనీలో అక్రమంగా నీటిని తోడుతున్న బోరుబావిని వెంటనే సీజ్ చేయాలని శ్రీరమణకాలనీ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. కాలనీలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, కాలనీలో బోరుబావి నుంచి నీటిని తోడుతూ అక్రమంగా నీటి వ్యాపారం చేస్తుండటంతో కాలనీలోని బోర్లు అడుగంటిపోయాయని, ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా నీటి వ్యాపారం చేస్తున్న వ్యక్తులపై చర్యలు చేపట్టి నీటి దందాను అరికట్టాలని కోరారు. అధికారులు స్పందించని పక్షంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని అసోసియేషన్ నేతలు హెచ్చరించారు.